క్లుప్తంగా

యోగాతో జ్ఞాపక శక్తి పెంచుకోవచ్చు



అంబాజీపేటలో విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇస్తున్న శ్రీనివాస్

అంబాజీపేట: యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు జ్ఞాపకశక్తిని పెంచుకోవచ్చని అంబాజీపేట శ్రీ స్వామి వివేకానంద యోగా గురువు యోగా శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన వేదిక కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అధ్యక్షతన విద్యార్థులకు యోగాపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా యోగా శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్నతనం నుంచి యోగాలో అలవర్చుకోవడంతో మానసిక ఉల్లాసాన్ని పొంది మేధాశక్తి పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

హై ఓల్టేజీతో ఏసీ దగ్ధం



వక్కలంకలో దగ్ధమైన ఏసీ

అంబాజీపేట: విద్యుత్ సరఫరాలో హైఓల్టేజీ సమస్య కారణంగా ఇంటిలో పని చేస్తున్న ఏసీ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. వక్కలంక గ్రామంలో అల్లాడ వెంకటేశ్వరరావుకు చెందిన రూ.35 వేలు విలువ చేసే ఏసీ హై ఓల్టేజీ రావడంతో ఒక్కసారిగా మంటలు వచ్చి ఖాళీ పోయింది. ఓల్టేజీ సమస్య వల్లే ఈ ప్రమాదం జరిగిందని వెంకటేశ్వరరావు చెబుతున్నారు. హై ఓల్టేజీ వస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

డాక్టర్ బిక్కిన వీరాస్వామి కన్నుమూత



డాక్టర్ బిక్కిన వీరాస్వామి

రాజోలు: తాటిపాకకు చెందిన ప్రముఖ డాక్టర్ బిక్కిన వీరాస్వామి(85) మంగళవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను చికిత్స నిమిత్తం విజయవాడ తీసుకుని వెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఐదు దశాబ్దాలుగా తాటిపాక పరిసర ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించి అందరి మన్ననలు పొందారన్నారు. ఐదు రూపాయలే ఓపీ ఫీజుగా తీసుకునేవారు. డాక్టర్ వీరాస్వామి మృతి తీరనిలోటని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతిపై మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాజోలు, పి.గన్నవరం ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాదరావు, కొండేటి చిట్టిబాబు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

స్కూటర్ అపహరణ

మండపేట: పట్టణంలోని 21వ వార్డు రావులపేట వీధిలో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. ఇక్కడి రామాలయం ఎదురుగా ఉండే వీధిలో నివాసం ఉంటున్న తొగర దొరబాబుకు చెందిన స్కూటర్‌ను అర్ధరాత్రి ఎవరో అపహరించుకు పోయారు. బైక్ యజమాని దొరబాబు ఆ రోజు రాత్రి తన పని ముగించుకుని ఇంటి ఎదురుగా పార్క్ చేసి ఉంచానని చెప్పారు. ఉదయం లేచి చూసేసరికి తన స్కూటర్ కనిపించకుండా పోయిందన్నారు. దీనిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపారు.

గడ్డి యంత్రంతో లాభాలెన్నో

- గడ్డి సేకరణతో తీరనున్న పశుగ్రాసం కొరత
- తగ్గనున్న గాలి కాలుష్యం
- సద్వినియోగమవుతున్న స్ట్రాబేలర్



సేకరించిన గడ్డిమోపులతో వెళుతున్న వాహనం



పెదపళ్లలో గడ్డిని సేకరిస్తున్న స్ట్రాబేలర్ యంత్రం

అలమూరు: వరిసాగులో అధునాతన వరికోత యంత్రాలు అందుబాటులో రావడంతో వరి గడ్డి నిరుపయోగంగా మారింది. పశుగ్రాసానికి ఉపయోగించే ఎండుగడ్డి కొరత పాడిరైతులను తీవ్రంగా వేధిస్తోంది. ఈ కొరతను నివారించేందుకు వ్యవసాయశాఖ గడ్డి సేకరణ యంత్రం (స్ట్రాబేలర్) అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇది పశుగ్రాస సేకరణకు ఎంతగానో దోహదపడుతోంది. తొలుత వీటిని ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి మధ్యవర్తులు కమీషన్ పద్ధతిలో ఇక్కడకు తీసుకువచ్చి సేకరించిన గడ్డి మోపునకు రుసుం వసూలు చేసేవారు. అయితే ప్రభుత్వం గత మూడేళ్ల నుంచి గడ్డి సేకరణ యంత్రాలను అందుబాటులోకి తెచ్చింది. దీంతో ట్రాక్టర్‌కు దమ్ము చక్రాలు అమర్చే విధంగానే స్ట్రాబేలర్ యంత్రాన్ని అమర్చి గడ్డి సేకరణ జరుపుతుండడంతో ఇటు రైతులకు, అటు కొనుగోలుదారులకు లాభదాయకంగా మారింది. గతంలో స్థానిక పాడి రైతులు గడ్డిని సేకరిద్దామనుకున్నా వ్యయ ప్రయాసలు ఎక్కువగా ఉండడంతో యంత్రంతో కోసిన వరిగడ్డిని పొలంలోనే వదిలేసి నిప్పు పెట్టేవారు. దీంతో ఎండుగడ్డి కొరత ఎక్కువై ఏటా ధర పెరుగుతూ వచ్చేది. మరి కొంత మంది రైతులు పెట్టుబడి ఎక్కువైనా కూలీలతో కోయించి వరి గడ్డిని భద్రపరచుకునేవారు. ఇలాంటి తరుణంలో గోసంరక్షణ కేంద్రాలకు, డెయిరీఫాంలకు, పేపర్ మిల్లులకు ఎండుగడ్డి సేకరణ కష్టసాధ్యమైంది. దీంతో వారంతా స్ట్రాబేలర్ యంత్రాలను తీసుకువచ్చి ట్రాక్టర్ సాయంతో పొలాల్లో వ్యర్థంగా పడి ఉన్న ఎండుగడ్డిని సేకరించి తీసుకెళ్లేవారు. ఈ స్ట్రాబేలర్ యంత్రాలు పనితీరును గుర్తించిన స్థానిక రైతులు రాయితీపై తమకు ఇవ్వాలంటూ వ్యవసాయశాఖ, పశుసంవర్ధకశాఖకు విజ్ఞప్తి చేశారు.

ఎకరాకు రెండు టన్నుల గడ్డి లభ్యం

స్ట్రాబేలర్ యంత్రంతో సేకరించే పొలంలో ఎకరాకు దాదాపు రెండు టన్నుల గడ్డి లభిస్తోంది. స్ట్రాబేలర్ యంత్రం సుమారు 20 కేజీల చొప్పున మూట కట్టిన గడ్డిమోపులను పొలంలోనే పడవేస్తుంది. ఎకరాకు సుమారు 90 నుంచి 105 వరకూ గడ్డి మోపులు లభిస్తున్నాయి. యంత్రాలను తీసుకువచ్చిన నిర్వాహకులే ఈ గడ్డి మోపులను తమ ప్రాంతాలకు తరలిస్తున్నారు. అందులో భాగంగా ఒక్కొక్క గడ్డి మోపునకు రూ.20 చొప్పున ధర రైతుకు చెల్లిస్తుండగా మరి కొంత మంది ఉచితంగా ఇస్తున్నారు.

కాలుష్య నివారణ



యంత్రాలతో వరి చేల కోత కోసినప్పుడు వచ్చే గడ్డిని వదిలేసిన పంటను తీసుకెళ్లేవారు. పొలంలో ఉన్న ఆ గడ్డికి నిప్పు పెట్టడం వల్ల కాలుష్యం ఏర్పడేది. ఇప్పుడు ఆ గడ్డిని తగులబెట్టకుండా ట్రాక్టర్ ఉపకరణ పనిముట్లు మాదిరిగానే ఈ స్ట్రాబేలర్ యంత్రంతో సేకరిస్తున్నారు. దీనివల్ల గడ్డి వృథా తగ్గడమే కాకుండా పొగ వల్ల కలిగే కాలుష్యాన్ని నివరించవచ్చు.

– కె.నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ ఏడీ, ఆలమూరు

తీరుతున్న పశుగ్రాసం కొరత



ట్రాక్టర్‌కు వెనుక భాగాన స్ట్రాబేలర్ యంత్రాన్ని అనుసంధానం చేసి గడ్డిని సేకరించడం వల్ల పశుగ్రాసం కొరత నుంచి ఉపశమనం కలుగుతుంది. రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ స్ట్రాబేలర్ యంత్రాల వినియోగంపై పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ట్రాక్టర్ యజమానులకు శిక్షణను ఇస్తాం

– ఎల్.అనిత, పశుసంవర్ధకశాఖ ఏడీ, ఆలమూరు

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



ఈదరాడలో ర్యాలీ నిర్వహించిన వైద్యారోగ్య సిబ్బంది

మామిడికుదురు: మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తద్వారా అంటువ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలను నివారంచడమే కాకుండా సౌకర్యవంతమైన నెలసరిని కలిగి ఉండేందుకు దోహదం చేస్తుందని ఎంఎల్‌హెచ్‌పీ కె.లావణ్య సూచించారు. లూటుకుర్రు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఈదరాడలో మంగళవారం ఋతుక్రమం ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఋతుక్రమం సమయంలో మహిళలు తగిన ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దీనిపై అవగాహన లేక చాలా మంది మహిళలు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈదరాడ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కె.ఉమామహేశ్వరరావు, ఏఎన్ఎంలు పి.స్వాంతకుమారి, ఎంటీ గంగాభవాణి, ఆశ కార్యకర్త ఎస్.కమలావతి పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి

- పల్లెల్లో గ్రామ దేవతలకు తీర్థ మహోత్సవాలు
- మొక్కులు తీర్చుకున్న భక్తులు
- వివిధ సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు



వక్కలంకలో ఉన్న ముత్యాలమ్మ, లంకాలమ్మ అమ్మవార్లు





వానపల్లిలో పళ్లాలమ్మవారికి మొక్కుబడులు సమర్పిస్తున్న ప్రభుత్వ సలహాదారు నేమాని భాస్కర్. (ఇన్‌సెట్) బంగారం, వెండి ఆభరణాలతో విశేష అలంకరణలో పళ్లాలమ్మ అమ్మవారు

కొత్తపేట: వానపల్లి గ్రామ దేవత, ఉభయగోదావరి జిల్లాల ప్రజల ఇలవేల్పు పళ్లాలమ్మ అమ్మవారి తీర్థమహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవస్థానం కమిటీ చైర్మన్ కామిశెట్టి అమ్మన్న ఆధ్వర్యంలో ఈఓ బి.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు భక్తుల సౌకర్యార్థం వివిధ ఏర్పాట్లు చేశారు. సోమవారం తాళ్లలేపి ఉయ్యాల మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. రాత్రి అమ్మవారి పెద్ద జాతర ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు. దేవస్థానం తరుపున పూజారులు మహాకుంభాభిషేకం నిర్వహించారు. సాయంత్రం సిరిమాను ఉత్సవాన్ని కోలాహలం నిర్వహించారు. భక్తులందరికీ పులిహోర ప్రసాదం, మజ్జిగ సరఫరా చేశారు. పలు సేవా సంస్థలు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వానపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు.



బి.దొడ్డవరంలో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ప్రభుత్వ సలహాదారు నేమాని భాస్కర్ ప్రత్యేక పూజలు

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా ప్రయోజనాలు) నేమాని భాస్కర రామం (భాస్కర్) అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ముఖ మండపం, రాజగోపురం తదితర నూతన నిర్మాణాలకు నిధుల మంజూరులో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డితో పాటు గ్రామానికి చెందిన భాస్కర్ తన వంతు కృషి చేసిన విషయం తెలిసిందే. తీర్థమహోత్సవాలు పురస్కరించుకుని ఆలయానికి విచ్చేసిన భాస్కర్‌కు ఆలయ ముఖ ద్వారం వద్ద స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు ఘనంగా స్వాగతం పలికి ఆలయానికి తొడ్కొని వెళ్లారు. అనంతరం ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు సమర్పించారు. డీసీసీబీ పర్సన్ బండారు సత్తిరాజు (రాజా), స్థానిక, స్థానికేతర ప్రాంతాల నుంచి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ ఆధ్వర్యంలో రావులపాలెం సర్కిల్ పరిధి స్టేషన్ల ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

బి.దొడ్డవరంలో..

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామ దేవతలు శ్రీముత్యాలమ్మ, గోగులమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, పూజ ఘటం ఊరేగింపు, భక్తుల కోలాహలం నడుమ జాతర కన్నుల పండుగలా జరిపించారు. మంగళవారం భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. భారీ గజమాలలను ఊరేగింపుగా తీసుకు వచ్చి అమ్మవార్లకు అలంకరించారు. బుధవారం సిరిబొమ్మ తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. పెదపట్నంలంక గ్రామ దేవత శ్రీమహాలక్ష్మమ్మ జాతరలో భాగంగా మంగళవారం సిరిబొమ్మ తీర్థం వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు.

వక్కలంక గ్రామంలో..

అంబాజీపేట: వక్కలంక గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ, లంకాలమ్మ అమ్మవార్ల తీర్థ మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ఆడపడుచులు అమ్మవార్లకు చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు. తీర్థాన్ని పురస్కరించుకుని అమ్మవారి పూజఘటాలను పుర వీధులో ఉరేగించారు. సోమవారం రాత్రి నిర్వహించిన అమ్మవారి జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, గరగ నృత్యాలు చూపలరులను కనువిందు చేశాయి.

జాస్‌తో సంపూర్ణ ఆరోగ్యం



కలవచర్లలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



చింతలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది, కిషోర్ బాలికలు

ఆలమూరు: రాష్ట్రంలోని గ్రామీణ పేద ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష (జాస్) పేదలకు సంపూర్ణ ఆరోగ్య రక్షణకు తోడ్పాటును అందిస్తుందని ప్రత్యేక వైద్య నిపుణులు జి. దుర్గా ప్రసాద్, మేఘ స్పందన, నేత్ర వైద్య నిపుణురాలు పి.శ్రీలక్ష్మి అన్నారు. కలవచర్లలో మంగళవారం జాస్ పేజ్-2 కార్యక్రమం జరిగింది. పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పి.భవానీ శంకర్, డి.సాయి కిషోర్ నేతృత్వంలో వైద్యారోగ్య అధికారులు, సిబ్బంది సుమారు 187 మందికి వైద్య సేవలను అందించి, మందులను అందజేశారు. అవసరమైన రోగులకు రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న వారిని ఆరోగ్యశ్రీ పథకం క్రింద రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వి.వేణి, సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఎంఎల్‌హెచ్‌పీలు వి.సువర్చల, సీహెచ్ మౌనిక, ఆరోగ్య మిత్ర నామాల రామకృష్ణ, ఏఎన్ఎం కె.రాణి, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

కిషోర్ బాలికలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

ఆలమూరు: కిషోర్ బాలికలు రుతుక్రమ సమయాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని సంపూర్ణ ఆరోగ్య రక్షణ పొందాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ అధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున, డి.సాయికిషోర్ అన్నారు. రుతుక్రమం ఆరోగ్యం-పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో ఎంఎల్‌హెచ్‌పీల ఆధ్వర్యంలో ప్రపంచ కిషోర్ బాలికల సదస్సులను ఏర్పాటు చేశారు. కిషోర్ బాలికలు పాటించాల్సిన నియమాలను వివరించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కిషోర్ బాలికల సౌకర్యార్థం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలియజేశారు. అనంతరం ఆయా వైఎస్సార్ హెల్త్ క్లినిక్ పరిధిలో కిషోర్ బాలికలతో కలిసి వైద్యారోగ్య సిబ్బంది భారీ ర్యాలీలు నిర్వహించారు. హెచ్‌వీలు పి.ఉమ, ఆర్.బాలామణి, ఎంఎల్‌హెచ్‌పీలు వి.సువర్చల, సీహెచ్ మౌనిక, కె.కళాంజలి తదితరులు పాల్గొన్నారు.

రెండు వాహనాల సీజ్

ఆలమూరు: చింతలూరులో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న రెండు వాహనాలను మండల రెవెన్యూ శాఖ సీజ్ చేసింది. ఈ సీజ్ చేసిన వాహనాలను మైన్స్ శాఖకు అప్పగించినట్టు తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్ తెలిపారు.

ఎన్నికల్లో విద్యార్థుల సేవలు అమూల్యం

అయినవిల్లి: ఎన్నికల్లో విద్యార్థులు అందించిన సేవలు అమూల్యమని స్థానిక ఎస్సై బి.రాజేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎన్నికల్లో విధులు నిర్వహించిన 30 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, రూ.500 చొప్పున అందజేశారు. సామాజిక కార్యక్రమాల్లోను విద్యార్థులుగా అందిస్తున్న సేవలు ఎస్సై రాజేష్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసుస్టేషన్ సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్, గౌరవవేతనం అందిస్తున్న ఎస్సై

ఓట్ల లెక్కింపు రోజు అవగాహనతో మెలగాలి



కపిలేశ్వరపురం సమావేశానికి హాజరైన జెడ్పీటీసీ తదితరులు

కపిలేశ్వరపురం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజైన జూన్ 4న శాంతి భద్రతల విషయంలో పాటించాల్సిన నిబంధనలతో రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహనతో మెలగాలని మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్, తహసీల్దార్ రాజరాజేశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం రాజకీయ పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులకు లెక్కింపు ప్రక్రియపైనా, క్షేత్ర స్థాయిలో శాంతి భద్రత పరిరక్షణకై ఉన్నతాధికారులు రూపొందించిన నిబంధనలపై అవగాహన కల్పించారు. బాధ్యత కలిగిన నాయకులుగా కార్యకర్తలను నిబంధనలు పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలను మీరినవారిపై చట్ట పరిధిలో కఠిత చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ ఎంపీఎం ప్రకాష్, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామాల్లోని వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అగ్రహారంలో కార్డన్ అండ్ సెర్చ్



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై సురేష్‌బాబు తదితరులు

రామచంద్రపురం రూరల్: ఎలక్షన్ ఫలితాల దృష్ట్యా బయట వ్యక్తుల ద్వారా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు పలు చోట్ల ఆకస్మిక తనిఖీలు చేస్తున్నట్టు రామచంద్రపురం సీఐ పి.దొరరాజు వెల్లడించారు. అందులో భాగంగా జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, డీఎస్పీ బి.రామకృష్ణ ఆదేశాల మేరకు అంబకపల్లి అగ్రహారంలో మంగళవారం కార్డన్ అండ్ సెర్చ్‌ను నిర్వహించినట్టు ఆయన తెలిపారు. రామచంద్రపురం పోలీస్, క్యూఆర్‌టీ సిబ్బంది సహకారంతో జరిగిన తనిఖీల్లో గ్రామంలో సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు లేని 9 మోటారుసైకిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు. సంబంధిత వాహనదారులు మోటారు వాహనాల రికార్డులను తీసుకురావాలని లేకుంటే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై సురేష్‌బాబు తెలిపారు. అనంతరం ఎస్సై సురేష్‌బాబు గ్రామస్తులకు అవగాహన సదస్సును నిర్వహించి సూచనలు చేశారు.

ఎన్టీఆర్ చిరస్మరణీయుడు

మామిడికుదురు: టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చిరస్మరణీయుడని మాజీ జెడ్పీటీసీ భూపతిరాజు ఈశ్వరరాజువర్మ ప్రస్తుతించారు. ఎన్టీఆర్ 101 జయంతిని మంగళవారం మామిడికుదురు టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి ఆ పార్టీ నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, పార్టీ నేతలు బోనం బాబు, ఈలి శ్రీనివాస్, చుట్టుగుళ్ల కిశోర్, సూదా బాబ్జి, వర్ధినేని వెంకటరామయ్య, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

అంబాజీపేట: టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని అంబాజీపేట, పుల్లేటికుర్రులలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పుల్లేటికుర్రులో ఎన్టీఆర్ చిత్రపటానికి నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నందంపూడిలో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ జయంని నిర్వహించారు.

ఆలమూరు: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని మంగళవారం ఘనంగా జరిగాయి. మండల టీడీపీ శాఖ అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి నేతృత్వంలో పార్టీ శ్రేణులు వేడుకలు జరుపుకొన్నారు. గుమ్మిలేరు. నవాబుపేట, చింతలూరు, మడికి, జొన్నాడ, చొప్పెల్ల తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

టౌన్ సీఐగా జేమ్స్ రత్నప్రసాద్



రావులపాలెం: స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా జేమ్స్ రత్నప్రసాద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఏసీబీ వలలో పట్టుబడిన సీహెచ్ ఆంజనేయులు స్థానంలో జేమ్స్ రత్నప్రసాద్ ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌ఓగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.

నేడు వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగర గ్రామంలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు నిర్వహించనున్నారు. వైశాఖ మాసం బహుళ షష్ఠి తిథి నేపథ్యంలో నిర్వహించనున్న ఈ పూజలకు ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకుల బృందం ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం తదితర పూజలను చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.